www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 26 మే 2024
5
అన్నమయ్య



సయ్యద్ జుల్ఫికర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - నందలూరు

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అఫ్ ఇండియా ద్వారా చేసిన సేవలకు మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ అరవపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జుల్ఫికర్‌కు రాజమండ్రిలో 25వ తేదీ ఉదయం జరిగిన డాక్టర్ రేట్ ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో డేస్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవలతో ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌పిసిఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ తాళ్లూరి ప్రసన్నకుమార్, సౌత్ ఇండియా చైర్మన్ శ్రీక ృష?, హెచ్ ఆర్ పి సి ఐ చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షులు డాక్టర్ ఉమాదేవి, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, పాల్గొన్నారని తెలిపారు.




డాక్టరేట్ అందుకుంటున్న సయ్యద్ జుల్ఫికర్

విద్యుత్ కోతలు.. బిల్లుల వాతలు

అదనపు ఛార్జీలతో బాదుడే.. బాదుడు
పెరుగుతున్న డిమాండ్... తగ్గుతున్న సరఫరా
వినియోగదారుల్లో ఆందోళన

ప్రజాశక్తి - రాయచోటి

అప్రకటిత విద్యుత్ కోతలతో అన్నమయ్య జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పగలంతా కష్టపడి ఏదో ఒక పనిచేసి తిరిగి రాత్రి ఇంటికి చేరుకొని ప్రశాంతంగా నిద్ర పోవాలనుకునే వారికి విద్యుత్ కోతలతో అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు పట్టణాల్లో గాలి వీచకపోవడంతో నిద్ర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కోతలు లేని విద్యుత్ అందిస్తామంటూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ రాయచోటి జిల్లా కేంద్రంలో మాత్రం ఎప్పుడు పడితే అప్పుడు, సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధించడం వల్ల చిన్న చిన్న వ్యాపారులు కూడా అనేక ఇబ్బందులు గురవుతున్నారు. జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్న నిరుద్యోగులు కరెంట్ ఉంటేనే రూ.10 వస్తుందంటున్నారు. కరెంటు లేకపోవడం వల్ల జిరాక్స్, ఇంటర్నెట్‌కు వచ్చిన వారు వెనుతిరగడంతో వచ్చే పది రూపాయలు కూడా రావడం లేదని వాపోతున్నారు. మరోవైపు సామాన్యులు సైతం కరెంటు బిల్లులు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఏమో విద్యుత్ ఛార్జీలు పెంచమని గతంలో వాగ్దానం చేసి 2019 అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి ఇప్పటి వరకు 9 సార్లు కరెంటు ఛార్జీలు పెంచడంతో సామాన్యులు బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ ఛార్జీలు పేరుతో మోత మోగిస్తూ సామాన్యుడిపై బాదుడే బాదుడు అనే పరిస్థితి నెలకొంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అధిక బిల్లులు వస్తున్నాయి. వాడుకున్న విద్యుత్ బిల్లులు మెయింటెనెన్స్ కింద అదనపు ఛార్జీలే ఎక్కువగా ఉంటున్నాయని వాపోతున్నారు. ఇటీవల కాలంలో రాయచోటి, మదనపల్లి, పీలేరు, రాజంపేట, రైల్వే కోడూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఏకంగా నాలుగైదు గంటలపాటు విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు అనేక ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ కోతలు ఏ సమయంలో పోతుందో, ఏ సమయంలో వస్తుందో తెలియక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే ప్రస్తుతం వేసవికాలం కావడంతో అటు వ్యాపారులు, ప్రజలు, అధికారులు, కార్మికులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పంటల కోసం విద్యుత్ సరఫరాను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు మరొక వారం ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 7 గంటల చొప్పున విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. విద్యుత్ మధ్యలో అనేకసార్లు అంతరాయం ఏర్పడుతుందని దీనికోసం పొలాల వద్ద ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందని పలు రైతులు ఆరోపిస్తున్నారు. అధిక బిల్లులు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక ఇంటికి రెండు



బల్బులు, ఒక ఫ్యాను ఉన్న అలాంటి ఇంటికి కూడా వేలాది రూపాయలు కరెంటు బిల్లు రావడంతో ఆ ఇంటి యజమాని లబోదిబోమంటూ విద్యుత్ కార్యాలయల చుట్టూ తిరిగుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

అంతరాయాన్ని నివారించాలి



గ్రామీణ ప్రాంతాలలో ఇటీవల కాలంలో సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయి. విద్యుత్ ఛార్జీలు మాత్రం అధికంగా వసూలు చేస్తున్నారు. దీనివల్ల చిన్న పిల్లలు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాల వద్ద విద్యుత్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయాన్ని లేకుండా నివారించాలి.

- చంద్రయ్య, యండపల్లి, రాయచోటి.

విద్యుత్ కోతలు లేవు



జిల్లా వ్యాప్తంగా గతంలో లాగా ప్రస్తుతం ఎటువంటి అధికారిక విద్యుత్ కోతలు లేవు. వాతావరణ పరిస్థితులవల్ల అధిక గాలులు, మెరుపులతో విద్యుత్ అంతరాయం కల్గితే ఎప్పటికప్పుడు సిబ్బంది సాయంతో పునరుద్ధరించడం జరుగుతోంది. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- వై.చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్ ఇఇ, రాయచోటి, అన్నమయ్య జిల్లా.

ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యం

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ

ప్రజాశక్తి-సుండుపల్లి

ఫిర్యాదులు లేని సేవలే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ ఎస్ఇ ఎస్. రమణ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని సానిపాయ 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సానిపాయ రైతులు తమ విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశాఇంచారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎస్ఇ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల లైన్లు తెగిపడే అవకాశాలున్నాయని, తగు జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కారాదని సూచించారు. సర్వీస్ పొందిన మీటర్ ద్వారానే విద్యుత్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడూ సరిచేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు ఇస్తుందని, విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దు, వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులు చేయాలని తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని ఆదేశించారు. లైన్లలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయలను అరికట్టి నాణ్యమైన విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారునితో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావధానంగా విని పరిష్కరించి సంస్థపై ప్రజలలో సంతృప్తికరస్థాయిని పెంచాలని తెలియజేశారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. సమావేశంలో రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చాంద్‌బాషా, అసిస్టెంట్ ఇంజినీర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ ఎస్ఇ రమణ

12లోగా నాడు-నేడు పనులు పూర్తి చేయాలి : డిఇఒ



నాడు-నేడు పనులపై సమీక్ష చేస్తున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేపట్టిన 2వ విడత మనబడి నాడు-నేడు పనులను జూన్ 12వ తేదీలోగా త్వరితగతన పూర్తి చేసుకోవాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి యు.శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పీలేరు పట్టణంలోని కోటపల్లి జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణను, పరీక్షా కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో చేపట్టిన రెండవ విడత మనబడి నాడు-నేడు పనులను కూడా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో మనబడి నాడు-నేడు పనుల స్థితిగతులపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష చేశారు. నిర్మాణంలోని పనులను త్వరగా పూర్తి చేయాలని వారిని ఆదేశించారు. వారంలో రెండు పాఠశాలల్లో ఆల్ కాంపోనెంట్స్ పూర్తయ్యేలా ఓ కార్యాచరణ ప్రణాళికను తయారు చేసి తనకు ఇవ్వాలని తెలిపారు. ఈ సందరరేగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తలుపులు, కిటికీలు సమయానికి అందక పనులు పూర్తి కావడంలేదని డిఇఒ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన డిఇఒ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే తలుపులు, కిటికీలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా ఆందనున్న విద్యా కానుకలను నిల్వ చేయడానికి అవసరమైన స్టాక్ పాయింట్ ఏర్పాటుకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పంపిణీ కోసం వచ్చే వస్తువులు నిల్వ చేయడానికి చేసిన ఏర్పాట్లను, విద్యా కానుక కిట్ల ప్యాకింగ్ ఎలా చేస్తారు, పంపిణీ కోసం ఎలాంటి చర్యలు తీసుకోనున్నారన్న సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్‌తో సమీక్షించి సర్వే సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిఇఒ వెంట ఎఎస్ఒ నాగేందర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, కెవి పల్లి ఎంఇఒ పి.రెడ్డి బాష, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, మండల వనరుల కేంద్రం సిబ్బంది, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్లు పాల్గొన్నారు. మొదటిసారి పీలేరుకు వచ్చిన డిఇఒను యుటిఎఫ్ నాయకులు శివారెడ్డి, అక్రం బాష, తదితరులతో పాటు సిఆర్‌పి సిబ్బంది దృశ్యాలువలతో సత్కరించారు.

కలికిరి : నాడు-నేడు రెండవ దశ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి శివ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కలికిరి ఎమ్మార్సీని సందర్శించి మండలంలోని 30 ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనుల పురోగతిపై ఎంఇఒ కరీముల్లా, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పునఃప్రారంభమయ్యే నాటికి పూర్తి అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యా కిట్లు పంపిణీ గోదాంను పరిశీలించి స్టాక్ భద్రతపై ఎంఇఒ సూచనలు అందించారు. కార్యక్రమంలో మెయిన్ స్కూల్ హెచ్‌ఎం మురాద్ షా వలి, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

ఓట్ల లెక్కింపు కేంద్రంలో ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు జరగాలని జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం రాయచోటిలోని ఓట్ల లెక్కింపు కేంద్రమైన సాయి ఇంజినీరింగ్ కళాశాల నందు రాజంపేట లోక్‌సభ, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ గదుల ఏర్పాట్లను, ఇతర ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్, జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి వచ్చే అభ్యర్థులకు, సిబ్బందికి, ఏజెంట్లకు, పోలీసులకు, కౌంటింగ్ కేంద్రంలో వారికి కేటాయించిన గదులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వెళ్లేందుకు అవసరమైన సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కౌంటింగ్ గదులలో ఏజెంట్లు కూర్చోవడానికి ఎంపిక చేసిన స్థలానికి బ్యారికెడింగు పటిష్ఠంగా అమర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల పరిశీలకులకు అవసరమైన గదులను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రానికి బయట మీడియా కేంద్రాన్ని, ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జూన్ 4వ తారీఖు జరగబోయే కౌంటింగ్ ప్రక్రియ నిరంతరాయంగా జరిగేలా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు జరగాలన్నారు. తనిఖీలో డిఆర్ఒ సత్యనారాయణరావు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ఒలు, ఎఆర్ఒలు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డిఇఒ ప్రకాష్‌రెడ్డి

అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు అందజేయాలి

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాయచోటి మండలానికి విద్యాకానుక-5 కింద ఇప్పటివరకు 2,15,780 పుస్తకాలు వచ్చాయని అన్నారు. వీటిని ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎడి ప్రసాద్ బాబు, మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ నాయక్, వెంకట శివారెడ్డి, ప్రధానో పాధ్యాయులు రామకృష్ణ, డిఇఒ సిసి హాబీబ్ పాల్గొన్నారు.

ఆత్మీయ నాయకుడిని పోగొట్టుకున్నాం : 'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు


మండలంలో ఒక ఆత్మీయ నాయకుడిని పోగొట్టుకున్నామని రాయచోటి శాసన సభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పిఎసిఎస్ అధ్యక్షులు, కీర్తిశేషులు మిట్టపల్లి వేదమూర్తిరెడ్డి పెద్దకర్మకు హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన రోజు ఇటువంటి మంచి మనిషిని చూడడానికి రాలేకపోయానని పేర్కొన్నారు. మృతుడి భార్య, కుమారులు, కోడళ్లను పరామర్శించారు. ఆయన వెంట జడ్‌పి మాజీ చైర్మన్ దేవనాద్ రెడ్డి, మాజీ ఎంపిపి సుదర్శన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రమేష్‌కుమార్‌రెడ్డి, దాసరి చిన్నరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు ప్రజా ప్రతినిధులు బంధువులు పాల్గొన్నారు.



వేదమూర్తిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

144 సెక్షన్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-సుండుపల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించుకునే ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని, ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి సిఐ తులసిరామ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మతసామరస్య కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఘర్షణలకు చోటు ఇవ్వకుండా తిరుణాలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుండుపల్లి ఎస్ఐ ఎస్.ఎం.కె హుస్సేన్ మాట్లాడుతూ మండలంలో ప్రజలంతా మంచి సోదరుభావంతో మెలిగేవారని తెలిపారు. గత ఏడాది చోటు చేసుకున్న సంఘటనల వల్ల శాంతియుత సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఈ ఏడాది నిర్వహించే వేడుకలు, ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూసుకోవాలని మత పెద్దలకు విజ్ఞప్తి చేశారు. తిరుణాలలో చాందిని బండ్లు కట్టేవారు ప్రత్యేక జాగ్రత్తలు వారు తెలిపారు. కార్యక్రమంలో అన్ని మతాల పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మండల నాయకులు, కార్యకర్తలతో రాంప్రసాద్‌రెడ్డి

'మండిపల్లి' ఆత్మీయ పలకరింపులు

ప్రజాశక్తి-గాలివీడు

రాయచోటి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో మండల పరిధిలో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ పలకరించారు ఎన్నికల సమయంలో ఎండను సైతం లెక్కచేయకుండా రాత్రింపగలు అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలను, అభిమానులను సంతోషంగా పలకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి.కెన. మహమ్మద్ రియాజ్, కొండ్రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, మాలసాని సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు వీర రాఘవులు, సురేష్ కుమార్ పాల్గొన్నారు.



సబ్ జైలు వద్ద బత్యాల చెంగల్రాయుడు

అధైర్య పడొద్దు..అండగా ఉంటా : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అధైర్య పడొద్దు., అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు అన్నారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల రోజు రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట మండలం, దలవాయపల్లి పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘర్షణలో మల్లు వెంకటేశ్వరరెడ్డి, మల్లు సిద్ధారెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, దస్తగిరి, సిద్దిక్‌లను పోలీసులు అరెస్టు చేసి వారం రోజుల క్రితం రిమాండ్‌కు తరలించి రాజంపేట సబ్ జైల్లో ఉంచారు. శనివారం బత్యాల సబ్ జైల్‌కు వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని, కక్షపూరితంగా వ్యవహరించి అక్రమ కేసులు పెట్టిన ఏ ఒక్కరిని వదిలిపెట్టనని, తప్పు చేసిన ప్రతి ఒక్కరు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ కార్యని ర్వాహక కార్యదర్శి కె.వెంకటసుబ్బయ్య యాదవ్, దేవరకొండ నరసింహులు, సురేంద్రరెడ్డి, కేతరాజుపల్లి పి.వెంకటసుబ్బయ్య, అనాసముద్రం రమణారెడ్డి, పెద్దిరెడ్డి, శ్రీనివాసులు రాజు, గురుమూర్తి, రాంనగర్ నరసింహ, దగ్గుపాటి సుబ్రమణ్యం, మందా శ్రీనివాసులు, తోట ప్రసాద్, అణమలగుండం విజయ్ కుమార్, అడ్వకేట్లు నాగేశ్వర్ రావు, వెంకటసుబ్బయ్య, చంద్రశేఖర్, అక్షయ్ పాల్గొన్నారు.

వైసిపి నేత దారుణ హత్య

ఆధిపత్యంలో అడ్డొస్తున్నాడని హతమార్చిన వైనం
విలేకరుల సమావేశంలో డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి



శేషాద్రి (ఫైల్‌ఫొటో)

అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట అనపగుట్ట శివారు ప్రాంతంలో శేషాద్రి(35) అనే వ్యక్తి ఆధిపత్య పోరులో శనివారం ఉదయం వేకువ జామున అత్యంత కిరాతకంగా హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గొల్లపల్లి దళితవాడకు చెందిన కొండుపల్లి ఆనంద్, అతని అనుచరులు చరణ్, మణికంత, చిన్నారెడ్డి మరి కొంత మంది అనుచరులు శనివారం అర్ధరాత్రి తర్వాత పుంగనూరు శేషాద్రి ఇంటికి వెళ్ళి దౌర్జన్యంగా ఇంటిలోకి చొరబడి, తలుపులు పగలగొట్టి కత్తులు, వేట కొడవళ్ళతో దాడిచేసి అతి కిరాతకంగా హత్య చేశారని, దీనిపై హత్యకేసుగా నమోదు చేశామని మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. పుంగనూరు శేషాద్రి, కొండుపల్లి ఆనంద్ బహుజనసేన సంస్థ ఏర్పాటు చేసుకుని కలసికట్టుగా సెటిల్మెంట్ కార్యక్రమాలు నిర్వహించే వారని వెల్లడించారు. శేషాద్రి రామారావుకాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, స్వతహాగా సెటిల్మెంట్ చేస్తుండటంతో ఇరువురు మధ్య వివాదం ఏర్పడింది. తన దందాలకు అడ్డొస్తున్న శేషాద్రి అంతమొందించాలని కొండుపల్లి ఆనంద్ పతకం ప్రకారం శనివారం రాత్రి తన అనుచరులతో దాడులు చేసి హత్య చేసినట్లు తెలిపారు. ఈ హత్య వెనుక ఎంతమంది వ్యక్తులు ఉన్నా, ఎంతటి వారైనా వదలిపెట్టే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. గతంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవల్లో రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నా రన్నారు. చంపిన వారు, చనిపోయిన వారు వైసిపికి చెందిన వారేన న్నారు. పాత ముద్దాయి కొండుపల్లి ఆనంద్ 2014, 2020లో జరిగిన రెండు హత్య కేసులలో ప్రధాన ముద్దాయి అని, అతనిపై కోర్టులో కేసులు నడుస్తోందని తెలిపారు. ఆరుగురిపై మాత్రమే హత్యకేసులో ముద్దాయిలుగా పేర్కొన్నామని, ఇంకా కొంతమంది ఉన్నట్లు తెలిసిందని, విచారణలో ఎంతమందైనా, ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. ఇప్పటికే వన్ టౌన్ సిఐ వల్లిబాషా, టూటౌన్ సిఐ యూవరాజ్, రూరల్ సిఐ శేఖర్‌లతో మూడు టీములు వేసి నిందితును పట్టుకునేందుకు రంగంలోకి దిగారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

30 నుంచి ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-గాలివీడు

దివానే సహెబ్ ఉరుసు మహోత్సవం ఈనెల 30,31 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇమామ్‌సాబ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక పంచాయతీలోని పెద్దురు కస్పా వెనుకవైపు ఉన్న చెరువు వంకలో వెలసిన దివానే సాహెబ్ ఉరుసు ఉత్సవంలో భాగంగా గురువారం రాత్రి ఒంటి గంటకు గంధం ఉంటుందన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు ఉరుసు ఉత్సవం నిర్వహిస్తామన్నారు. గంధం రోజు ఖవ్వాలి నిర్వహిస్తామని, అన్నదానం కూడా ఉంటుందని ఆయన తెలిపారు.



దివానే సాహెబ్ దర్గా



అన్నం వడ్డిస్తున్న యల్లటూరు శ్రీనివాసరాజు

అన్నదానం..మహాదానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నిదానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఎన్నికల సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాస రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో వెలసిన అంకాల తిరునాల మహోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను గ్రామస్థులు, జనసైనికులు మేళ తాళాలు, పూలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా శ్రీనివాసరాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తాదులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా యల్లటూరు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఊటుకూరుకు చెందిన బాలిశెట్టి నారాయణ, మలిశెట్టి శివ నారాయణ, కర్నాటకం శ్రీనయ్య, రమణయ్య, చెంగల రాయుడు, పెడకాల సుధాకర్, ఆకుల చంద్ర, ప్రసాద్, సంబారు నరసింహ, యమ్.గోపి, మల్లికార్జున, సాయి, ఉదయ్, గోవర్ధన్, పాండు, గౌతం, కె.సాయి, ఉప్పు కార్తిక్, చింతల కార్తిక్, రాగల దినేష్, సంబారు ఓబులేష్, చిన్న ఓబులేష్, పెద్ద ఓబులేష్, కిరణ్, పెడకాల నిహం పాల్గొన్నారు.



చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న నగర పంచాయతీ కార్మికులు

మెరుగైన పారిశుధ్య కల్పనే ధ్యేయం : కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో మెరుగైన పారిశుధ్య కల్పనే ధ్యేయమని బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ అన్నారు. శనివారం క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పాశంవీధి, పిటిఎం రోడ్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల రోడ్డు, కట్టలపై పారిశుధ్య పనులను చేపించారు. మట్టిని, చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిర్విరామంగా పారిశుధ్య పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి రోజు ఏదో ఒక వార్డులో, క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాల ద్వారా పారిశుధ్య పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని, తద్వారా క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలన్నారు. పట్టణంలో ఎక్కడ అపరిశుభ్రత ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ కర్తవ్యమని పేర్కొన్నారు.

వైభవంగా మాతమ్మ జాతర

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలంలోని పెద్దకారంపల్లి గ్రామ పంచాయతీలోని అరుంధతి వాడలో శ్రీశ్రీశ్రీ మాతమ్మ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా ఆలయ నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. సుమారు ఏడు దశాబ్దాల తర్వాత జరుగుతున్న ఈ జాతరకు అన్ని విధాలుగా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తున్న ప్రవాస భారతీయుడు కెకె.రెడ్డి సహాయం వెలకట్టలేనిదని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల నుండి జరుగుతున్న జాతర మహోత్సవం సందర్భంగా మాతమ్మ ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసి చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. సుమారు ఆరు రోజులు పాటు జరిగే ఈ జాతర మహోత్సవానికి అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సుమారు 7 దశాబ్దాల తర్వాత జరుగుతున్న జాతరకు ఎన్‌ఆర్‌ఐ కెకె.రెడ్డి, మన్నూరు రామలక్ష్మమ్మ, మన్నూరు నారాయణరెడ్డి చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా మాతమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సాంప్రదాయపద్ధంగా ప్రజలు ఈ జాతర మహోత్సవాన్ని జరుపుకోవడం విశేషం. విదేశాల్లో స్థిరపడిన వారు సైతం ఈ జాతరకు రావడం విశేషం. ఊరు ప్రజలు ఐదు రోజులు జరిగే ఈ జాతరకు గ్రామ ప్రజలు బంధువులను, స్నేహితులను జాతరకు ఆహ్వానించారు.

ఘనంగా కోటకొండ గంగమ్మ తిరుణాల

ప్రజాశక్తి తంబళ్లపల్లి

కోటకొండ పంచాయతీ కోటకొండ చెరువుకట్టపై వెలసిన శ్రీ కోటకొండ గంగమ్మ తిరుణాల శుక్రవారం రాత్రి శనివారం పగలు ఘనంగా నిర్వహించారు. పూజారి శ్రీనివాసులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు అభిషేకాలతో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందిని బండ్ల మెరువని భక్తులను అల్లరింప చేశాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు పద్మనాభరెడ్డి, రాజేష్,ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున,రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని రంగంపల్లి పంచాయతీలోని అరుంధతివాడ గ్రామ ప్రజలు నీటి కష్టాలతో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు వారం రోజుల నుంచి తమ గ్రామంలో తాగునీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఈ సమస్యను తక్షణమే అధికారులు పరిష్కరించాలని పలువురు గ్రామ ప్రజలు తెలియజేశారు. శనివారం నాడు గ్రామ సమస్య పరిష్కారం కోసమై బిఎస్‌పి రైల్వేకోడూరు ఎమ్మెల్యే అభ్యర్థి తాళ్లపాక సుబ్రహ్మణ్యం మండల ఎంపిడిఒ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. అధికారి స్పందించి సమస్యపై తక్షణమే నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. అరుంధతి వాడ గ్రామంలో నీటి సమస్య ఉంది కాబట్టే వారం రోజుల నుంచి ఏ అధికారికి చెప్పినా తమ గ్రామం వైపు కన్నెత్తి చూడడం లేదని, పట్టించుకోవడంలేదని, అదే గ్రామంలో జరిగితే వెంటనే అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరిస్తారని పలువురు అరుంధతివాడ ప్రజలు తెలియజేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. ఈ సంఘటనపై మండల ఎంపిడిఒను వివరణ కోరగా తక్షణమే నీటి ట్యాంకర్ల ద్వారా గ్రామంలోకి నీటిని సరఫరా చేస్తామని తెలియజేశారు. మోటారు సమస్యను కూడా పరిష్కరిస్తామని తెలపారు.



ఎంపిడిఓకు వినతిపత్రం ఇస్తున్న సుబ్రహ్మణ్యం

చుక్కల్లో నిత్యావసర ధరలు

ముట్టుకోనివ్వని మాంసం ధరలు - గగనమవుతున్న సామాన్యుల బతుకులు



దుకాణంలో అమ్మకానికి ఉంచిన చికెన్, నిత్యావసర వస్తువులు, కూరగాయలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినట ట్లేదు.. కొండెక్కిన కూరగాయ ధరలు, చుక్కలు చూపిస్తున్న నిత్యావసర ధరలు, ముట్టుకోనివ్వని మాంసం ధరలు సామాన్యుడి జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా రోజురోజుకూ ధరలు పెరుగుతుండడంతో సామాన్యుని బతుకు భారమవుతోంది. ధరలను నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయనే ఆరోపణ లున్నాయి. గతేడాది వర్షపాతం తగ్గడంతో భూగర్భ జలాలు అడుగం టాయి. వర్షాభావంతో పంటల దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో నిత్యావసర, కూరగాయల ధరలు గణనీయంగా పెరగడానికి కారణమయ్యాయి. ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరఫరా చేసి సామాన్యులపై ఉన్న భారాన్ని తగ్గించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కొండెక్కిన కూరగాయలు..

కూరగాయల మార్కెట్‌లో ఒకటి రెండు తప్ప.. మిగతా వన్నీ కిలో రూ.80పైనే పలుకుతున్నాయి. టమాట, వంకాయ మాత్రమే కిలో రూ.40 లోపు ఉన్నాయి. బెండకాయ, దొండకాయ, చిక్కుడు, బీరకాయ, గోరుచిక్కుడు, పులగంద, క్యాప్సికం రేట్లు కిలో రూ.80పైనే ఉన్నాయి. రూ.5కు దొరికే మునక్కాయ ఇప్పుడు రూ.10 అయింది. ఎండాకాలంలో కూరగాయల ఇలా రేట్లు పెరగడంతో జనం అల్లాడుతున్నారు.

చుక్కలు చూపిస్తున్న నిత్యావసర ధరలు..

కందిపప్పు, పెసరపప్పు మొన్నటివరకు కిలో రూ.110 వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.180కి చేరాయి. నువ్వులు కిలో రూ.200 దాటాయి. మినపప్పు కిలో రూ.140 నుంచి రూ.180 వరకు వెళ్లింది. పల్లినూనె రేట్లు కిలో రూ.160కి తక్కువ లేవు. కంపెనీ పల్లి నూనె రూ.190 పలుకుతోంది. సన్‌ఫ్లవర్ నూనె రేట్లు రూ.115 నుంచి రూ.120, పామాయిల్ రేట్లు రూ.90 నుంచి రూ.100 వరకు ఉన్నాయి. ఇక అల్లం కిలో రూ.200 దాటగా, తెల్లగడ్డలు కిలో రూ.200 దాకా అమ్ముతున్నారు. ఏడాది కిందట క్వింటాల్ బియ్యం రూ.4,500 నుంచి రూ.5వేల మధ్య ఉండగా.. ఇప్పుడు రూ.6 వేల నుంచి రూ.7 వేల దాకా అమ్ముతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బియ్యం రేట్లను సగటున రూ.600 నుంచి రూ.800 దాకా పెంచేశారు. పాత రకాలను రూ.7,200 నుంచి రూ.7,400 దాకా అమ్ముతున్నారు. బియ్యం రేట్లను వ్యాపారులు ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు. గతంలో బియ్యం రేట్లపై ప్రభుత్వం నియంత్రణ ఉండేది. మిల్లులకు, మన అవసరాలకు మించి స్టాక్ ఉన్నప్పుడే ఎగుమతులకు అనుమతులు ఇచ్చేవారు. బియ్యం రేట్ల నియంత్రణ చేయడంలో ప్రభుత్వం విఫలమైనందున మిల్లర్లంతా సిండికేట్‌గా మారి, ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

భగ్గుమంటున్న మాంసం ధరలు

కూరగాయల ధరలతోపాటు మాంసం ధరలు భారీగా పెరిగాయి. కిలో మటన్ రూ.800, చికెన్ గతంలో రూ.180 ఉండేది. ఇప్పుడు రూ.280, స్కిన్ లెస్ చికెన్ రూ.300 అమ్ముతున్నారు. కోడిగుడ్డు రేటు కూడా రూ. 5నుంచి రూ.7కు చేరింది. కూరగాయల రేటుతోపాటు మాంసం రేట్లు కూడా పెరగడంతో ఏం తినాలో అర్థం కాని పరిస్థితుల్లో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారు.

జీతం సరిపోవడం లేదు..

కూరగాయలు, నిత్యవసర సరుకులు, మాంసం ధరలు అమాంతం పెరగడంతో వచ్చే జీతం సరిపోవడం లేదు. నెలకు రూ.12వేలు జీతం వస్తే సరుకులకే సరిపోతుంది. ఇతర ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తోంది.

- గోపాల్ రెడ్డి, చిరుద్యోగి, పులివెందుల

అప్పు చేయక తప్పడంలేదు..

కూరగాయల ధరలు విపరీతంగా పెరగడం వల్ల మార్కెట్‌కు పోతే టరూ.600అవుతోంది. నిత్యవసర ధరలు పెరగడం, దీనికి తోడు ఎండాకాలం కావడంతో కూలి పనులు కూడా లేవు. జీవనం సాగించడానికి అప్పు చేయక తప్పడంలేదు.

- భవాని, వ్యవసాయ కూలీ, పులివెందుల

పచ్చళ్లతో సర్దుకుపోతున్నాం..

ధరలు పెరగడం వల్ల కూరగాయలు కొనలేక పచ్చళ్లతో సర్దుకుపోవాల్సి వస్తోంది. వచ్చే ఆదాయంలో నిత్యవసర వస్తువులు కొనే పరిస్థితి లేదు. బతకడానికి కావాల్సిన వస్తువులు మాత్రమే మార్కెట్ నుంచి తెచ్చుకుంటున్నాం.

- దేవి, గృహిణి, పులివెందుల

బురద కుంటను తలపిస్తున్న బోలె వార్డు

సుందరీకరణ చేసినా.. చిన్నపాటి వర్షానికే జలమయం



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ నడి వీధిని అత్యంత సుందరీకరణతో తీర్చిదిన సెంట్రల్ బోలె వార్డు చిన్నపాటి వర్షానికే బురద కుంటను తలపిస్తోంది. శుక్రవారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి బోలె వార్డులో వర్షపు నీరు ఎక్కడ చూసినా నిలిచి ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా పులివెందుల అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు. ఇందులో సెంట్రల్ బోలె వార్డుకు రూ.5.40 కోట్లు వెచ్చించి అత్యంత సుందరీకరణ చేశారు. అయితే అధికారులు నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోకుండా పనులు ప్రారంభించడంతో ప్రస్తుతం చిన్నపాటి వర్షానికి సెంట్రల్ బోలే వార్డులో బురద నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లకుండా ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఆ వర్షపు నీటి వల్ల ఏర్పడిన బురద వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. వాహనాలు అటుఇటు తిరుగుతూ ఉన్నప్పుడు ఆ బురద పాదచారులపై పడుతోంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి వర్షపు నీరు నిలవకుండా పోయేలా చర్యలు తీసుకోవాలని బోలె వార్డు ప్రజలు కోరుతున్నారు.

కెజిసెట్-2కె24 ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

వరుసగా 4 సంవత్సరం విజయవంతంగా కెజి సెట్ -2కె24 ఫలితాలను కందుల గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కె.రాజేశ్వరితో కలిసి విడుదల చేశారు. ఈ నెల 1,2,3వ తేదీలలో నిర్వహించిన పరీక్షలకు విశేష స్పందన లభించింది. 3,900 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ఈ పరీక్షలలో విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మొదటి ర్యాంకు సాధించిన వారికి తమ కళాశాలల్లో ఉచితంగా విద్యతో పాటుగా వసతి కల్పిస్తామని, రెండో ర్యాంకు సాధించిన వారికి వసతి కల్పిస్తామని చెప్పారు. అలాగే మహిళా విద్యార్థినులకు కెఎల్ ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ర్యాంకు వారికి విద్య, వసతి, రెండో ర్యాంకు వారికి వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కళాశాల వైస్ చైర్మన్ కె.మదన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్‌ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.నాగేశ్వర ప్రసాద్, కె ఎస్ ఎం ప్రిన్సిపల్ డాక్టర్.నాగమణి, కె ఎల్ ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, అడ్మిషన్స్ డీన్ టి.కిషోర్ కుమార్, కెఎస్ ఆర్ ఎం అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెట్రోల్ విక్రయాలపై పోలీసుల నిఘా

ప్రజాశక్తి - సింహాద్రిపురం

జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో పోలీసులు పులివెందుల నియోజకవర్గంలో జల్లెడ పడుతున్నారు. ఇందులో భాగంగా పెట్రోల్ లూజ్ అమ్మకాలపై నిఘా పెట్టారు. వాహనాలకు మాత్రమే పెట్రోల్ పట్టాలని బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కువ పెట్రోల్ కొనుగోలుపై ఆరా తీస్తున్నారు. వైసిపి అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎన్‌డిఎ తరపున మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీ చేసిన విషయం విదితమే. బీటెక్ రవి సొంత మండలం సింహాద్రిపురం కావడం పట్ల పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నియోజవర్గంలో ఎన్నికల సజావుగా ముగిసినా.. ఫలితాలు త్వరలో ప్రకటించనున్న నేపథ్యంలో అల్లర్లు జరక్కుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో సైతం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అనిల్‌కుమార్ హెచ్చరిస్తున్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - కడప

విద్య ఎంతో విలువైందని, క్రమశిక్షణతో అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్‌ఎస్‌ఎ ఇన్‌ఛార్జి సెక్రటరీ ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా శనివారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 1979, మే 25న న్యూయార్క్‌లో పాఠశాలకు వెళుతున్న ఆరేళ్ల పిల్లవాడైన ఎటాన్ పాట్జ్ అదృశ్యమయ్యాడని, ఎప్పటికీ చేధించలేని మిస్టరీగా ఆ కేసు మిగిలిపోయిందని అన్నారు. 1983లో యునైటెడ్ స్టేట్స్ అధ్యక్షులు రోనాల్డ్ రీగన్ మే 25ను ఎటాన్ పాట్జ్ జ్ఞాపకార్థంగా జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. 2001, మే 25న మొట్టమొదటిసారిగా ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించారని తెలిపారు. తప్పిపోయిన పిల్లల, అపహరణకు గురైన పిల్లల గురించి ప్రజల్లో అవగాహన పెంచడంకోసం ఈ దినోత్సవం జరుపుకుంటారు అని చెప్పారు. 2001 నుండి 6 ఖండాల్లోని 20కి పైగా దేశాల్లో ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు అని అన్నారు. 1998లో యున్కెటెడ్ స్టేట్స్‌లో ఐసిఎంఇసి అనే సంస్థ ప్రారంభించారని పిల్లల అపహరణ, పిల్లలపై లైంగిక వేధింపులు, పిల్లల దోపిడి లేకుండా ప్రపంచాన్ని సురక్షితమైన ప్రదేశంగా మార్చడానికి పనిచేస్తున్న లాభాపేక్ష లేని సంస్థ అని చెప్పారు. అల్బేనియా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బెలారస్, బెల్జియం, బ్రెజిల్, కెనడా, చిలీ, కోస్టారికా, ఈక్వడార్, జర్మనీ, గ్రీస్, గౌతమాలా, ఐర్లాండ్, ఇటలీ, జమైకా, లుధియానా, మెక్సికో, నెదర్లాండ్స్, పోలాండ్, పోర్చుగల్, రష్యా, సెర్బియా, దక్షిణ కొరియా, స్పెయిన్, తైవాన్, యున్కెటెడ్ కింగ్‌డమ్, యున్కెటెడ్ స్టేట్స్ వంటి 29 దేశాలు ఈ సంస్థ పరిధిలో పనిచేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరిండెంట్ జి.వీరయ్య, డిస్ట్రిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ జి చెన్నారెడ్డి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, మెడికల్ ఆఫీసర్ లక్ష్మిపాల్గొన్నారు.

రూ.1.19 లక్షల విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి వీరాంజనేయ స్వామి దేవాలయానికి విచ్చేసే భక్తులకు వివిధ దాతల ద్వారా రూ.1,19,067 నిత్య అన్నదా నానికి విరాళాలు అందిం చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. వేంపల్లి మండలం అలవల పాడు గ్రామానికి చెందిన పేరం చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాప కార్థం ఆయన కుమా రులు విష్ణువర్ధన్‌రెడ్డి, చక్ర పాణిరెడ్డి రూ.25,116 తో పాటు అన్నదానం వద్ద భక్తుల ద్వారా రూ.94,971 వచ్చినట్లు వారు తెలిపారు. వేసవి సెలవులు కావడంతో శనివారం తెల్లవారుజాము నుండి ప్రధాన అర్చకులు కేసరి స్వామి ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాములు ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు అభిషేకం చేసి పలు రకాల పూలతో అలంకరించారు. భక్తులతో గండి క్షేత్రం పోటెత్తింది. దాతల సహకారంతో ప్రతిరోజు నిత్య అన్నదానం ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకమని భక్తులు పేర్కొన్నారు.

ఒడుగులు చేయించడం మంచి సంప్రదాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇస్లామియా షాదీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పేద ముస్లిం పిల్లలకు ఉచిత ఒడుగుల కార్యక్రమాన్ని స్థానిక ఇంటర్నేషనల్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంజుమన్ మాజీ అధ్యక్షుడు ముక్తియార్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్ నాయుడు మాట్లాడుతూ ఒడుగులు చేయించుకోడం ఆరోగ్యపరంగా మంచి సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఈరానిబాషా, ఖలీల్, ముర్తుజాహుశేన్, అయూబ్‌ఖాన్, ఎర్రబల్లె దాదాపీర్, షబ్బీర్, జమీల్, ఖాదర్‌బాషా, మైను పాల్గొన్నారు.



పీలేరు : కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పీలేరు

సార్వత్రిక ఎన్నికల తర్వాత జరగనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరూ ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదని, అలా ఎవరైనా గొడవలకు ప్రయత్నిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోక తప్పదని పీలేరు సిఐ మోహన్ రెడ్డి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు శనివారం సిఐ స్థానిక పోలీసులతో పాటు సిఆర్‌పిఎఫ్ బలగాలతో పీలేరు పట్టణం తోపాటు, మండల పరిధిలోని తలుపుల గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి, నిబంధనలను అనుసరించి ఎన్నికల తర్వాత, ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా నివారణా చర్యలో భాగంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, కాబట్టి ప్రజలెవరూ గుంపులుగా చేరడం, ఊరేగింపులు నిర్వహించడం, సంబరాలు చేయడం, టపాకాయలు కాల్చడం, టపాకాయలు విక్రయించడం నిషిద్ధమని అన్నారు. కాబట్టి రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పోలీసుల హెచ్చరికలను పాటించాలని తెలియజేశారు. కార్యక్రమాల్లో స్థానిక సిఐతో పాటు ఎస్ఐ నరసింహుడు సిబ్బంది పాల్గొన్నారు.



నందలూరు : కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నందలూరు : సార్వత్రిక ఎన్నికల ఫలితాల సమయంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, రాజంపేట డిఎస్‌పి చైతన్య ఆదేశాల మేరకు నందలూరు గ్రామ పంచాయతీలోని దాసరిగడ్డ, బెస్త వీదీ నందు బిఎస్‌ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్), స్థానిక పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, టపాసులు పేల్చడం వంటివి చేయరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బిసిజి టీకా సురక్షితం : డాక్టర్

ప్రజాశక్తి-పీలేరు : జాతీయ బాలల వ్యాధినిరోధక టీకాలలో శిశువులకు ఇచ్చే బిసిజి టీకా ఇక పెద్దలకు కూడా కొన్ని పరిమితులకు లోబడి ఇవ్వడం జరుగుతోందని, క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పీలేరు ప్రాంతీయ టిబి నివారణ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం పీలేరు పట్టణంలోని బండ్లవంక సచి వాలయంలో "పెద్దల బిసిజి టీకా-సురక్షితం" ప్రచారంలో భాగంగా స్థానికులకు సూచనలు, సలహాలిచ్చారు. మధుమేహ వ్యాధి గ్రస్తులు, 60 సంవత్సరాలు పైబడ్డ వృద్ధులు, మద్యపానం, ధూమపానం, క్షయ నుండి నివారణ పొందినవారు, వారి సన్నిహితులు బలహీన వ్యాధి నిరోధక కలవారు ప్రతి గురువారం నిర్దేశించిన ప్రాంతాల్లో "వయోజన బిసిజి టీకా" పొందాలని, క్షయ వ్యాధి ఉధృతిని, ప్రమాదాన్ని, మరణాలను తగ్గించి, క్షయ రహిత సమాజం కోసం అందరూ భాగస్వాములు కావాలనీ డాక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, రత్నం, ఎఎన్‌ఎం భార్గవి, సిహెచ్‌ఓ చంద్రకళ, సుధ, ఆశ, అంగన్వాడీ కార్య కర్తలు ప్రజలు, పాల్గొన్నారు.



టీకా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

క్రైం కార్నర్

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లి

కురబలకోట రైల్వే స్టేషన్ వద్ద సింగన్నగారిపల్లె యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యచేసుకున్న విషాదకర సంఘటన శనివారం మధ్యాహ్నం వెలుగు చూసింది. కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం లోని కురబలకోట మండలం, సింగన్నగారిపల్లెకు చెందిన లేట్ వెంకటరమణ కుమారుడు కన్నెమడుగు గిరిబాబు (37), గత ఐదేళ్లుగా టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన గిరిబాబు కురబలకోట రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని మ ృతి చెందాడు. స్థానికులు గుర్తించి కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు వెంటనే ఘటనా స్థలం వద్దకు చేరుకొని మ ృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రామాపురం

కర్నూల్ -చిత్తూరు 40వ జాతీయ రహదారి మండల పరిధిలోని గన్‌సీదా మసీద్ వద్ద మోటర్ బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు..వీరబల్లి మండలం సానిపాయికి చెందిన మస్తాన్, బుజ్జి రామాపురంలో నిర్వహించే పశువుల సంతకు శనివారం మోటార్‌బైక్‌పై బయలు దేరారు. గన్‌సీదా వద్దకు రాగానే నూతనంగా ఏర్పాటుచేయబోయే విద్యుత్ లైన్ కోసం రోడ్డుపక్కన ఉంచి విద్యుత్ స్తంభాన్ని మోటార్‌బైక్ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు కిందపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో మస్తాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బుజ్జి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్కూటర్ అదుపుతప్పడంతో గాయపడిన మస్తాన్, బుజ్జి